## క్లుప్తంగా

### పైడితల్లిగా రాజరాజేశ్వరీదేవి



పైడితల్లమ్మగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీ దేవి అమ్మవారు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో వెలసిన రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు విజయనగరం పైడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో మంగళవారం పైడితల్లి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఘటాలు,ప్రభలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

### గ్రామాల్లో వైద్యశిబిరాలు



సీతారామపురంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలంలోని రామన్నపేట, సీతారామపురం గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో మంగళవారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. రామన్నపేటలో 63, సీతారామపురం 51 మందికి వైద్యాధికారి వివిధ వైద్యపరీక్షలు చేశారు. దగ్గు,జ్వరం,తలనొప్పి, తదితర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. ప్రజలకు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు.

### ఆర్థిక సహాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న మన వేపాడ- మన నేస్తం సేవా సంస్థ సభ్యులు

వేపాడ: మండల కేంద్రానికి చెందిన గుంపాన అప్పలనాయుడు కిడ్నీ,ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం మన వేపాడ- మన నేస్తం సేవా సంస్థ సభ్యులు బాధితుడికి మంగళవారం రూ.5 వేల ఆర్థిక సహాయం చేశారు. సేవా సంస్థ సభ్యులకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### వరిలో ఆకుముడత తెగులు



పెదవేమలిలో ఆకుముడత తెగులు సోకిన వరి చేను

గంట్యాడ: మండలంలోని పలు గ్రామాల్లో వరి పంటను ఆకుముడత తెగులు ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా 1121 రకం వరిలో ఈ తెగులు ప్రభావం ఎక్కువగా ఉంది. మొన్నటి వరకు పాముపొడ, సుడిదోమ తెగుళ్లు సోకడంతో రైతులు వాటి నివారణకు పురుగు మందులు పిచికారీ చేశారు. తాజాగా ఆకుముడత తెగులు ఆశించడంతో మళ్లీ పురుగు మందులు పిచికారీ చేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈతెగులు సోకిన వరి పంట ఆకులు ముడుచుకుపోతాయి. పొడవాటి తెల్లని చారలు ఆకులపై ఏర్పడతాయి. కొన్నిసార్లు ఆకుల చివర్ల నుంచి మొదలు వరకు ముడుచుపోతాయి. ఈతెగులు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటికి 2 గ్రాములు చొప్పు పిచికారీ చేయాల ని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

### ప్రారంభించేది ఎప్పుడో..?



ప్రారంభానికి నోచుకోని కొండలావేరు అంగన్‌వాడీ భవనం

మెరకముడిదాం: మండలంలోని కొండలావేరు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మించి నెలలు గడిపోతున్నా ఇంకా ప్రారంభం కాలేదు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏళ్ల తరబడి పరాయి పంచన నిర్వహిస్తున్నారు. సొంత భవనం లేకపోవడంతో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి గత ప్రభుత్వ హయాంలో పక్కా భవనం నిర్మించారు. ఎన్నికల కోడ్ అడ్డురావడంతో ఈభవనం ప్రారంభానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నేటికీ ఈ భవనాన్ని ప్రారంభించే ఆలోచన అధికారులు కానీ, పాలకులు కానీ చేయడం లేదు. ఐసీడీఎస్ అధికారులు కూడా ఈభవనాన్ని వినియోగంలోకి తీసుకురావడానికి ఎందుకో ఆసక్తి లేనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా భవనాన్ని ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# భద్రత గాలికొదిలేశారు..!

- ప్రమాదకరంగా ఆర్‌ఓబీ నిర్మాణ పనుల ప్రాంగణం
- కానరాని కనీస జాగ్రత్త చర్యలు, హెచ్చరిక బోర్డులు



ఆర్‌ఓబీ నిర్మాణం వద్ద కానరాని భద్రతా చర్యలు, హెచ్చరిక బోర్డులు



ఆర్‌ఓబీ వద్ద ఊడిపోయిన గతంలో కట్టిన షేడ్ నెట్

చీపురుపల్లి: సాధారణంగా రోడ్ల విస్తరణ, వంతెనల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు చేసే ప్రాంతాల్లో ఆ పనుల వల్ల ప్రజలు, ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడడం సంబంధిత కాంట్రాక్టర్ల బాధ్యత. నిర్మాణాలు చేపట్టే ప్రాంతాల్లో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకుండా కాంట్రాక్టర్ భద్రత చర్యలను పట్టించుకోకపోతే ఆ బాధ్యత పోలీసులైనా తీసుకోవాలి. కానీ చీపురుపల్లిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్‌ఓబీ) పనులు చేస్తున్న ప్రాంతంలో అటు కాంట్రాక్టర్, ఇటు పోలీసులు ప్రజల భద్రత గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చీపురుపల్లి నుంచి రా జాం వెళ్లే రోడ్డులో ఆర్‌ఓబీ నిర్మాణం కోసం చాలా కాలం క్రితమే పెద్దఎత్తున తవ్వకాలు చేశారు. అయితే ఇది పాలకొండ –విశాఖపట్నం ప్రధాన రహదారి కావడంతో నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. పాలకొండ, రాజాం ప్రాంతాలకు చెందిన ప్రయాణికులే కాకుండా తెర్లాం మండలం నుంచి చీపురుపల్లి మీదుగా విశాఖపట్నం, విజయనగరం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పాటు ఆర్‌ఓబీకి అవతలి వైపు జి.అగ్రహారంతో పాటు గరివిడి మండలంలోని వెదుళ్ల వలస, కుమరాం, కె.పాలవలస, బొండపల్లి, ఎం.దుగ్గివలస, ఐతంవలస మెరకముడిదాం మండలం లోని బిల్లలవలస, సాతాంవలస, కొండదాడి, భగీరథపురం, తదితర ప్రాంతాలకు చెందిన వారంతా చీపురు పల్లి, గరివిడి మండల కేంద్రాలకు ఈ ఆర్‌ఓబీ పనులు జరుగుతున్న ప్రదేశాన్ని దాటుకుని రావాల్సి ఉంటుంది. పనులు చేస్తున్న ప్రదేశంలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటి భద్రతా చర్యలు లేకపోవడంతో పాటు కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రయాణికుల డిమాండ్ మేరకు పనులు చేస్తున్న ప్రదేశంలో షేడ్ నెట్‌లు కట్టారు. అవి కాస్త ఊడిపోవడంతో ప్రస్తుతం ఎలాంటి భద్రత లేకుండా పోయింది. స్థానికంగా ఉండే ప్రయాణికుల సంగతి పక్కన పెడితే పొరుగు ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు రాత్రి సమయాల్లో ఆదమరిస్తే పెద్ద ప్రమాదం సంభవించే అవకాశం లేకపోలేదు. ఈ రోడ్డులో కొత్తగా ప్రయాణించే వారు రాత్రి సమయాల్లో ఆర్‌ఓబీ నిర్మాణం వద్ద గోతులను గుర్తించేలా రేడియం స్టిక్కర్లతో కూడిన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. పోలీసులు అయినా స్పందించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

# మందు మంత్రాంగం

- ఎస్.కోట నియోజకవర్గానికి 28 మద్యం దుకాణాలు
- లాటరీలో అధికంగా స్థానికేతరులకే దక్కిన షాపుల లైసెన్స్
- పరస్పరం దుకాణాలు మార్చుకునేందుకు చర్చలు



శృంగవరపుకోట: పట్టణాలు, ఊరూ, వాడా, గల్లీగల్లీలో కూడా మందు వాసనతో మత్తెక్కించి, కిక్కు ఎక్కించేందుకు కూటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. మందుబాబులైతే ఇక వేళాపాల లేకుండా "మందు బాబులం.. మేము మందుబాబులం.. మందు కొడితే మాకు మేమే మహారాజులం" అంటూ వీధుల్లో చిందులేసే రోజులొచ్చేశాయి. మద్యం దుకాణాలకు లాటరీ ప్రక్రియ పూర్తయ్యింది. నియోజకవర్గంలోని ఎస్.కోట మండలానికి 7, వేపాడకు 4, జామి మండలానికి 5, లక్కవరపుకోట మండలానికి 6, కొత్తవలస మండలానికి 6, మొత్తం 28 దుకాణాలు మంజూరయ్యాయి.

**మెజార్టీ దుకాణాలు స్థానికేతరులకే...**

దుకాణాల్లో మెజార్టీ దుకాణాలు లాటరీలో నాన్ లోకల్(స్థానికేతరుల) వారికే దక్కాయి. జామి, వేపాడ మండలాల్లో 9 దుకాణాలు నాన్‌లోకల్స్‌కి దక్కాయి. దీంతో పరస్పరం దుకాణాలు మార్చుకోవడానికి చర్చలు సాగుతున్నాయి. వ్యక్తిగతంగా, ఆర్థిక ఇబ్బందులున్నవారికి, అనుభవం లేని వారికి గుడ్‌విల్ గా కొంతమొత్తం ఇచ్చి వారిని తప్పించే పనిలో ఉన్నారు. ఒక్కో దుకా ణానికి 15 నుంచి 20 మంది వరకు గ్రూపుగా ఏర్పాటై పెట్టుబడి పెట్టారు. మందు వ్యాపారం కోసం సామాన్యులు సైతం ధైర్యంగా పెట్టుబడులు పెట్టారు. ఒక్కో గ్రూపు సభ్యులు 30 నుంచి 60 దుకా ణాలకు దరఖాస్తు చేశారు. ఎస్.కోటలో ఒక గ్రూపు సభ్యులు రూ.2.50 కోట్లు పెట్టుబడి పెట్టి రెండు దుకాణాలు దక్కించుకున్నారు. ఇలా అన్ని మండలాల నుంచి యువకులు పెద్ద సంఖ్యలో గ్రూపులుగా ఏర్పడి 20 నుంచి 30 దరఖాస్తులు చేశారు. ఆశించినట్లుగానే కొత్తవాళ్లు దుకాణాలు దక్కించుకుని మద్యం వ్యాపారంలో కొమ్ములు తిరిగిన బడా నేతలు, సిండికేట్ సభ్యులు, లిక్కర్ కింగ్‌లకు ఝలక్ ఇచ్చారు. 15 నుంచి 20 మంది సామాన్యులు గ్రూపుగా తయారై సొమ్ము పోగేసి దుకాణాల లైసెన్సుల కోసం పోటీ పడ్డారు. అదే పంథాలో షాపులు దక్కించుకున్నారు. దీంతో లిక్కర్ కింగ్స్ అంతా దుకాణాలు దక్కించుకున్న మిడిల్‌క్లాస్ కుర్రాళ్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.

**దుకాణాల వేటలో...**

లాటరీలో షాపులను దక్కించుకున్న నాన్‌లోకల్ వ్యక్తులు లోకల్ వ్యక్తులను ఆసరాగా చేసుకుని దుకాణాలు వెదుక్కునే పనిలో ఉన్నారు. మండలంలో ఎక్కడైనా దుకాణం నిర్వహించుకోవచ్చన్న నిబంధనతో మెరుగ్గా వ్యాపారం జరిగే స్థలాల్లో దుకాణాలు ఏర్పాటు చేసుకునేపనిలో పడ్డారు. ఈదఫా గ్రామాల్లో బెల్ట్ దుకాణాలకు మంచి గిరాకీ పెరుగుతోంది. లైసెన్స్‌డ్ దుకాణాల నిర్వాహకులు తమ వ్యాపారం పెంచుకోవడానికి బెల్ట్ దుకాణాలపై ఆధారపడనున్నారు.

# పరిశుభ్రత పాటించండి



కృష్ణారాయుడుపేట పాఠశాలలో విద్యార్థి విద్యా సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఎంఈఓ జగదీశ్వరరావు



వేపాడ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

వేపాడ: పాఠశాలల పరిసరాలతో పాటు తరగతి గదుల్లో, మధ్యాహ్న భోజన వంటలు చేసే ప్రాంతంలో పరిశుభ్రత పాటించాలని ఎంఈఓలు జగదీశ్వర రావు, బాలభాస్కర రావు ఉపాధ్యాయులు, వంట నిర్వాహకులకు సూచించారు. కృష్ణారాయుడుపేట ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ జదీశ్వరరావు, వేపాడ ఉన్నత పాఠశాలను ఎంఈఓ-2 బాలభాస్కరరావు మంగళవారం సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్స్‌ను పరిశీలించడంతో పాటు వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. మెనూప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. వేపాడ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఎంఈఓ బాలభాస్కర రావు పలు సూచనలు చేశారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.భాస్కరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

### రోడ్డంతా గోతులమయం



పెదమానాపురం- ఇంగిలాపల్లి మధ్యలో గోతులు తేలిన రోడ్డు

దత్తిరాజేరు: పెదమానాపురం సంతతోట నుంచి ఇంగిలాపల్లికి వెళ్లే తారు రోడ్డు అంతా గోతులమయం కావడంతో ఆదారిలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. ఈమార్గంలో రోజూ అరగంటకు ఒక ఆర్టీసీ బస్సుతో పాటు పదుల సంఖ్యలో ప్రైవేటు వాహనాలు విజయనగరం నుంచి మెంటాడ మండలానికి తిరుగుతుంటాయి. రోడ్డులో సుమారు రెండు కిలోమీటర్ల మేర ఎక్కడికక్కడే గోతులు ఉండడంతో తరచూ ద్విచక్ర వాహనాలు, ఆటోలు బోల్తాకొడుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

### సమావేశ మందిర నిర్మాణానికి అనుమతులు

మెరకముడిదాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సమావేశ మందిర నిర్మాణానికి అనుమతు లు మంజూరయ్యాయని ఎంపీడీఓ జి.భాస్కరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న సమావేశ మందిరం చిన్నది కావడంతో సమావేశాల నిర్వహణకు ఇబ్బందిగా ఉందని, ఉపాధి హామీ నిధులు రూ.80 లక్షలతో భవనం నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు ఈనెల 17వ తేదీన శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు.

# విజేతలకు అభినందనలు



సమితి స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైన మనోజ్‌ను అభినందిస్తున్న కౌముది స్కూల్ ప్రిన్సిపాల్



జిల్లాస్థాయి గోవిజ్ఞాన పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన సర్వేపల్లి పాఠశాల విద్యార్థినులు

శృంగవరపుకోట: పట్టణంలోని సర్వేపల్లి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థినులు జిల్లాస్థాయి గోవిజ్ఞాన పరీక్షల విజేతలై నగదు ప్రోత్సాహకాలు అందుకున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ గోశాల విభాగం ఈనెల 14న గంట్యాడ గోశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి గోవిజ్ఞాన పరీక్ష ల్లో జూనియర్స్ విభాగంలో మండవల్లి హేమాంజలి ప్రథమ స్థానంలో నిలిచి రూ.3000, సీనియర్స్ విభాగంలో పాదం కావ్య ద్వితీయ స్థానం లో నిలిచి రూ.2000, దాసిక సాయిభార్గవి తృతీయస్థానంలో నిలిచి రూ.1,000 సాధించారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ పి.పైడిరాజు, ఉపాధ్యా య సిబ్బంది మంగళవారం అభినందించారు.

**వ్యాసరచనలో...**

స్థానిక కౌముది గ్లోబల్ స్కూల్ వేదికగా సత్యసాయి ట్రస్ట్ వారు ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కౌముది గ్లోబల్ స్కూల్ విద్యార్థి సలాది షణ్ముఖసత్యమనోజ్ ప్రథమ స్థానం సాధించి సమితి స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని ప్రిన్సిపాల్ శాంతి మహంతి మంగళవారం అభినందించారు.

# ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలాం



చీపురుపల్లి: అబ్దుల్ కలామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఆశయ రమణ, యువత



వేపాడ: సోంపురం హైస్కూల్‌లో కలాం జయంతి వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు

చీపురుపల్లి: మిస్సైల్ మ్యాన్, భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితాన్ని విద్యార్థులు, యువత ఆదర్శంగా, మార్గదర్శకంగా తీసుకోవాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కలాం జయంతిని మంగళ వారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రెడ్డి రమణ, యువత పూలమాల లు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ కలలు కనండి వాటిని సాకారం చేసుకోండని కలాం ఇచ్చిన సందేశాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. కలాం రచనలను తప్పకుండా చదవాలని సూచించారు.

**సోంపురం హైస్కూల్‌లో..**

వేపాడ: మండలంలోని సోంపురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి.పి.ఎ.రాజు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకల ను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పేపర్‌బాయ్ నుంచి రాష్ట్రపతి వరకు కలాం ఎదిగిన తీరు స్ఫూర్తిదాయకమన్నారు. కలాం జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సవంగా ఐక్యరాజ్య సమితి ప్రకటించిదన్నారు.

# సీసీ రోడ్డు పనులకు భూమిపూజ



వేపాడ: పాటూరులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి



బొండపల్లి: బోడసింగిపేటలో భూమి పూజ చేస్తున్న సర్పంచ్,అధికారులు

వేపాడ: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా మండలంలో పాటూరు,వీలుపర్తి గ్రామాల్లో సీసీరోడ్డు పనులకు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఆయా గ్రామాల నాయకులు కొట్యాడ రమణమూర్తి, శానాపతి అప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు సుంకరి అప్పారావు,తదితరులు పాల్గొన్నారు.

**బోడసింగిపేటలో..**

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామంలో పల్లె పండగ కార్యక్రమంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ మీసాల జానకీ రాం,ఎంపీడీఓ జి.గిరిబాల మంగళవారం భూమిపూజ చేశారు. పంచాయతీరాజ్ జేఈఈ పి.అప్పలనాయుడు, ఉపాధి హామీ ఏపీఓ బి.కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి సీహెచ్.సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

# పైడితల్లికి ప్రణమిల్లి..

- అడుగడుగునా అమ్మకు నీరాజనం
- అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు
- సిరిమానును దర్శించి పులకించిన భక్తులు



సిరిమాను అధిరోహించేందుకు వస్తున్న పూజారి



కోట పరిసర ప్రాంతంలో జన సందోహం మధ్య సిరిమానోత్సవం



ఘటాలకు మొక్కుతున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. లక్షలాది మంది భక్తజనం సిరిమాను రూపంలో అమ్మవారిని దర్శించి, తరించారు. వేకువజాము నుంచి అమ్మను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. చదురుగుడి నుంచి కోట వరకు.. అటువైపు మినర్వా థియేటర్ వరకు క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. అమ్మవారికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలను సమర్పించారు. పూసపాటి వంశీయులు, అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, శాసనసభ ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

**స్వచ్ఛంద సంస్థల సేవలు..**

ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, రెడ్‌క్రాస్, వివిధ స్వచ్ఛంద సంస్థలు అమ్మవారి సిరిమానోత్సవంలో విశేష సేవ లందించాయి. వృద్ధులు, దివ్యాంగులకు తమదైన శైలిలో సాయమందిస్తూ ఉత్సవాన్ని ముందుకు నడిపించారు. వీటితో పాటు పట్టణంలోని పలువీధుల్లో భక్తులకు ఆహార పానీయాలు, ప్రసాదాలను ఉచితంగా పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న వనంగుడి, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, కన్యకా పరమేశ్వరి ఆలయం, గంటస్తంభం, బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్, శివాలయం వీధి, పూల్‌బాగ్, తదితర ప్రాంతాల్లో భక్తులకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సేవలందించారు.

**పులకించిన భక్తజనం..**

సిరిమానుపై అమ్మవారి ప్రతిరూపంగా ఆసీనులైన బంటుపల్లి వెంకటరావు భక్తులపై అక్షింతలు చల్లి ఆశీర్వదిస్తుంటే భక్తజనం భక్తితో ప్రణమిల్లారు. పైడితల్లి దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో ఆధ్వర్యంలో వందలాది మంది దీక్షాపరులు జై పైడిమాంబ నినాదాలతో హోరెత్తించారు. వేదపండితుల వేదమంత్రోచ్చారణలు, పాలధార, అంజలి రథం, ఎల్ల ఏనుగు, బెస్తవారి వలతో వచ్చిన వారందరూ భక్తిశ్రద్ధలతో ఉత్సవాన్ని విజయవంతం చేశారు. మధ్యాహ్నం 3.43 గంటలకు ప్రారంభమైన ఉత్సవం సాయంత్రం 5.28 గంటలకు ముగిసింది. ఈ అపూర్వ ఘట్టాన్ని లక్షలాది మంది భక్తులు తిలకించి పరవశించిపోయారు. పైడితల్లి అమ్మవారికి జేజేలు పలికారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మేడపై నుంచి సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

### నేటితో గడువు పూర్తి



మాట్లాడుతున్న ఏడీఏ మహరాజన్

గజపతినగరం: ఈ-క్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేసుకున్న రైతులు ఏమైనా అభ్యంతరాలు ఉన్నా, మార్పులు,చేర్పులు చేసుకో వాలనుకున్నా బుధవారం సాయంత్రం వరకే గడువు ఉందని గజపతినగరం ఏడీఏ కె.మహరాజన్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గంగచోళ్లపెంట గ్రామంలో రైతులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ-క్రాప్ వివరాలను సరిచేసుకునేందుకు రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు. ఈ-క్రాప్‌లో పంటల వివరాలు నమోదు చేసుకుని ఈకేవైసీ చేయించుకుంటేనే ప్రకృతి వైపరీత్యాలకు పంట దెబ్బతిన్నప్పుడు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందుతుందని చెప్పారు. అనంతరం గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంటను పరిశీలించారు. సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఏఓ సీహెచ్.ధనలక్ష్మి, వ్యవసాయ విస్తరణాధికారి ఏ.సతీష్, స్థానిక సర్పంచ్ బోని సంగమయ్య, ఎంపీటీసీ కనకల చినపైడన్న, నాయకులు మురళి,రామానందం తదితరులు పాల్గొన్నారు.

# పాడిరైతుల సదస్సును విజయవంతం చేయండి



కొండగంగుబూడిలో పాడి రైతులను సదస్సుకు ఆహ్వానిస్తున్న చల్లా జగన్, తదితరులు

వేపాడ: జామి మండల కేంద్రంలో ఈనెల 18వ తేదీన నిర్వహించనున్న జిల్లా పాడిరైతుల సదస్సును విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ పాడిరైతులను కోరారు. మండలంలోని కొండగంగుబుడి, రామస్వామిపేట, బొద్దాం, జాకేరు తదితర గ్రామాల్లో రైతు సంఘం నాయకులతో కలిసి మంగళవారం ఆయన పర్యటించారు. పాడిరైతులను కలిసి కరపత్రాలను అందజేసి సదస్సుకు ఆహ్వానించారు. పాల ఉత్పత్తులపై విధిస్తున్న జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలని, పాడి పశువులకు ఉచిత బీమా సదుపాయం కల్పించాలని, 75 శాతం రాయితీపై దాణా, మందులు సరఫరా చేయాలని, డెయిరీలన్నింటినీ సహకార రంగంలోకి తీసుకురావాలని, ఇతర డిమాండ్లతో నిర్వహించే సదస్సుకు పాడిరైతులు అంతా తరలిరా వాలని కోరారు.